# యండమూరి వీరేంద్రనాథ్

# రెండు గుండెల చప్పుడు



# రెండు గుండెల చప్పుడు

యండమూరి వీరేంద్రనాథ్

Kinige

RENDU GUNDELA CHAPPUDU
By :
YANDAMOORI VEERENDRANATH
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
HYDERABAD – 500 034
Ph. 924 650 2662
yandamoori@hotmail.com
yandamoori.com

SARASWATHI VIDYA PEETAM,
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM,
E.G.Dist. (A.P.)

Publishers :
NAVASAHITHI BOOK HOUSE
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
E-mail : navasahithiravi@gmail.com

This book is digitized and brought to you by KINIGE

© Author
© Yandamoori Veerendranath
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# రెండు గుండెల చప్పుడు

***భారత రాష్ట్రపతి లోపలికి వస్తుండగా, హాల్‌లో వున్న ఆహూతులందరు గౌరవ పురస్కరంగా లేచి నిలబడ్డారు. సుభాషిణి మాత్రం ఆయన్ని చూడటం లేదు. ఆమె చూపు ఒక మధ్య వయస్కురాలి మీద వుంది.***

***ఆవిడకి నలభై అయిదేళ్ళ దాకా వుండొచ్చు. జుట్టుకి రంగు వేయకపోవటంతో చెంపల మీద తెల్లవెంట్రుకలు హుందాగా మెరుస్తున్నాయి. ఆమె కళ్ళలో ఏదో తెలియని విషాదాన్నీ, దైన్యాన్నీ పసిగట్టింది సుభాషిణి.***

సుభాషిణి పెద్దగా లోకజ్ఞానం గానీ, ఏవైనా ప్రత్యేక సిద్ధాంతాల పట్ల గాఢమైన నమ్మకం గానీ వున్న అమ్మాయి కాదు. ఆమెలో వున్న ప్లస్ పాయింట్ సునిశిత దృష్టి.

ఎటువంటి చిన్న విషయమైనా ఆమె దృష్టి దాటిపోదు. చటుక్కున పట్టుకుంటుంది. అయితే దాని పట్ల విశ్లేషణా, పరిమాణక్రమపు అవగాహనా, హేతువూ మొదలైన లోతయిన విషయాలను పట్టించుకోదు.

ఈ లక్షణాలన్నీ కేవలం ఒకే ఒక వృత్తికి సరిగ్గా సరిపోతాయి. ఇలాంటి అర్హతలూ, అనర్హతలూ ఒకే ప్రొఫెషన్‌లో కావాలి.

జర్నలిజం!

సుభాషిణికి అందుకే ఆ ఉద్యోగం కరెక్టుగా కుదిరింది. ఆమె హైద్రాబాదులోని ఒక పత్రికలో జర్నలిస్టుగా పని చేస్తోంది. ఆమె భర్త రాష్ట్ర క్రీడా మండలికి సంబంధించిన ఒక ఉద్యోగి. నిజానికి ఆమె ముంబాయి రావటం తన పని మీద కాదు. భర్తకి తోడుగా వచ్చింది.

భైరవ్ కండూల్కర్‌కి "భారత దేశపు అత్యుత్తమ క్రీడాకారుడి బహుమతి" అందచేయబడుతున్న సందర్భంలో, రాష్ట్ర క్రీడామండలి తరుపున ఆమె భర్త హాజరయ్యాడు. నాలుగు రోజులు సెలవు తీసుకుని ఆమె కూడా అతడితో పాటు బయల్దేరింది.

హైద్రాబాద్‌లో వుంటే తనూ భర్తా ఒక్కరోజుయినా తీరుబడిగా గడపటం కుదరదని ఆమెకి తెలుసు. ఆమెకి జీవితం పట్ల చాలా ఆశలున్నాయి.

సుభాషిణి భర్త ప్రభాకర్ ఆమెకి సరిగ్గా వ్యతిరేకం! అతడికి పెద్దగా చురుకుదనం లేదు కానీ ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోగలడు. అతడిలో వున్న ఒకే ఒక దుర్గుణం.... కోపం! అది క్షణాల్లో పాదరసంలా పెరిగిపోతుంది. అయితే చాలా మందికి క్షణాల్లో తగ్గిపోతుంది. కానీ అతడికి తగ్గదు. పైగా గంటల తరబడి వాదిస్తాడు. తన కోప కారణాన్ని సహేతుకంగా వివరించటానికి ప్రయత్నిస్తాడు.

"చేతిలో ఏదుంటే అది విసిరేసి, చెయ్యవలసిన నష్టం అంతా చేసేసి క్షమాపణ చెప్పకపోగా దానికి సమర్ధనా, విశ్లేషణా కూడానా" అని దెప్పుతుంది

సుభాషిణి. అప్పటికి కోపం తగ్గిపోతే నవ్వేస్తాడు. తగ్గకపోతే, "....అవును. సమర్థనే. మీకెవరికీ నేను చెప్పేది అర్థం కాదు" అని అరుస్తాడు.

అప్పటికామెకి కోపం రాకపోతే నవ్వేస్తుంది. కోపం వస్తే ఆమె కూడా అరుస్తుంది. "..... మీరొక్కరేనా మేధావులు? మాకూ అంతో ఇంతో తెలివితేటలున్నాయి. ఆ మాట కొస్తే మీరు చెప్పేదే కరెక్టు కాదు! అందుకు తార్కాణం మీ కోపమే!! ఎప్పుడైతే మనిషి తన పాయింటు కరెక్టుగా అవతలి వారికి చెప్పలేడో, అప్పుడే కోపాన్ని ఆశ్రయిస్తాడు" అంటుంది.

దాంతో అతడి కోపం తారస్థాయికి చేరుతుంది. "నాది కోపం కాదు. చిరాకు, అవతలి వారు మూర్ఖంగా చేసే ప్రతి పనీ చిరాకు తెప్పిస్తుంది. అది నువ్వు చేసినా సరే! అందుకే నేను ఎప్పుడూ బతిమాలను. కోపమొచ్చిన మనిషి అది తగ్గిపోగానే తన 'అవసరం' తీర్చుకోవటం గుర్తించి బతిమాలుతాడు. నేను చెప్పేదాని మీద నాకు నమ్మకం వుంది కాబట్టి, నేను వాదించే ప్రతి దానికీ ఒక హేతువుంటుంది కాబట్టి నా అంతట నేను రాజీకి రాను." అంటాడు.

అది మాత్రం నిజం. అతడు తను చెప్పినదాన్ని లోతుగా నమ్ముతాడు. అస్సలు రాజీ పడదు. ఎన్ని రోజులయినా సరే, అలాగే వుండగలడు. ఆమె వుండలేదు.

భర్త కౌగిలి లేనిదే ఆమెకి నిద్రపట్టదు. ఏ ఇంట్లోనయినా భర్త కాస్త ముభావంగా వుంటే స్త్రీ సాధారణంగా భరించలేదు. మంచి చేసుకుంటుంది. అదే విధంగా తనకి కోపం వచ్చినప్పుడు అతడు తనని బ్రతిమాలాలని కోరుకుంటుంది. అది సహజం కూడా! సుభాషిణి విషయంలో కూడా ఇది ఒక రకంగా నిజమే

అయినా, మరో కారణం కూడా వుంది. సగటు స్త్రీ కన్నా ఆమెకి శారీరక వాంఛ కాస్త ఎక్కువ. అటువంటి పరిపూర్ణమైన రొమాంటిక్ వాంఛ కలిగిన ఆరోగ్యవంతమైన స్త్రీలు నూటికో కోటికో ఒకరుంటారు.

రాత్రయ్యేసరికి అవసరం కొద్దీ మొగవాడు మంచి వాడవుతాడంటారు. ఈ సూక్తి 'ఆమె' కు వర్తిస్తుంది. దీన్ని గురించి ప్రభాకర్ అప్పుడప్పుడు ఏడిపిస్తూ వుంటాడు కూడా! ఆమె ఉడుక్కోదు. పైగా బాణాన్ని తిప్పి కొడుతుంది కూడా . "అవును. నాకు కోరిక కాస్త ఎక్కువే. తప్పేం వుంది? మీకంత లేదు కాబట్టి మీరు బ్రతిమాలరు. పైగా దానికి వేరే కారణాలు చెప్తారు కూడా" అంటుంది. అతడు నవ్వేస్తాడు. ఆ కలహాల సరదా కాపురంలో ఆ విధంగా ఒకరోజు గడిచిపోతుంది.

సగటు మొగవాడికన్నా తన భర్తకి తక్కువ 'వాంఛ' వున్నదా అన్న విషయం ఆమెకు తెలిసే అవకాశం లేదు. ఆమెకు భర్త తప్ప మరో మొగవాడు తెలీదు.

* * *

ఆడిటోరియంలో చప్పట్లు ఆమెని ఈ లోకంలోకి తీసుకొచ్చాయి. భైరవ్‌కి రాష్ట్రపతి బహుమతి ప్రధానం చేస్తున్నాడు.

ఆమె దృష్టి, ప్రెసిడెంట్ వెనుక వున్న బాడీగార్డ్‌ల మీద పడింది. ఆడిటోరియంలో అందర్నీ క్షుణ్ణంగా పరిశీలించిగానీ లోపలికి వదల్లేదు. పైగా అక్కడున్న వారందరూ సమాజంలో పెద్దవారే. అయినా ఆయనికి అంగరక్షకులు ఎందుకో? అనుకుంది. ***భారతదేశపు నడిబొడ్డులో, నూరుశాతం భారతీయుల మధ్య భారత రాష్ట్రపతికి బాడీగార్డులు ఎందుకు*** – అన్న కాప్షన్ క్రింద ఒక వ్యాసం

వ్రాస్తే ఎలా వుంటుందన్న ఆలోచన కూడా వచ్చింది. (ఎందుకు కావాలో ఆ రాత్రే ఆమెకు అనుభవ పూర్వకంగా తెలిసింది. అది వేరే సంగతి)

'వ్యాసం' ఆలోచన రాగానే ఎడిటర్ మాటలు గుర్తొచ్చాయి.

"....మీ ఆయన పలుకుబడి ఉపయోగించి ఆ భైరవ్‌తో ఒక ఇంటర్వ్యూ మన పత్రిక్కి సంపాదించమ్మా. చాలా ఉపయోగకరంగా వుంటుంది?" అని కోరాడు.

భర్తకావిషయం చెప్పింది.

"ఎన్ని పేజీలు వేస్తావ్ ?" అని అడిగాడు.

"పేజీలా? ఇంకా నయం. మాది వారపత్రిక కాదు. దినపత్రిక. రెండు హాఫ్ కాలమ్‌లు వేస్తే అదే గొప్ప."

"దానికోసం అతని దగ్గిర ఇంటర్వ్యూ దేనికి? నువ్వే వ్రాసెయ్యి. మీ ఎడిటర్ చూడొచ్చాడు కనుకనా?"

ఆమెకి కోపం వచ్చింది...... "ఏమిటి మీ వుద్దేశ్యం?" అంది.

"చూడు సుభాషిణీ. మన తెలుగు డెయిలీ అతనెలాగూ చదవడు. కాబట్టి ఈ ఇంటర్వ్యూ సంగతి అతడికి తెలిసే అవకాశం ఎలాగూ లేదు. మరో భాషలోని ఇంటర్వ్యూలని తర్జుమా చేసి వెయ్యటం మీకూ కొత్త కాదు. కాబట్టి నువ్వే ఒక ఇంటర్వ్యూ తయారు చేసి నీ పేరు మీద వేసెయ్యి. ఏదైనా గొడవొస్తే నేను చూసుకుంటాను" అన్నాడు తేలిగ్గా. "....అయితే గొడవా, కాంట్రవర్సీ వచ్చే పాయింటు మాత్రం ఏదీ రాయకు. ఆ విషయం అతడికి చేరవేసే వాళ్ళు

వుంటారు. అలా అని అద్భుతంగా కూడా వ్రాయకు. ఇంత బాగా నేను ఇంటర్వ్యూ ఎప్పుడిచ్చానబ్బా అని అతడు ఎంక్వయిరీ చేసే ప్రమాదం కూడా వుంది."

అప్పటికే ఆమె ముక్కు ఎర్రబడింది. "మా ఇంటర్వ్యూ అంటే మీకంత చులకగా వుందా?" అని వుక్రోషంగా ప్రశ్నించింది.

"ఉన్న విషయం చెప్పానంతే. ఏదైనా ప్రత్యేక వార్త చెప్పాలనుకుంటే తప్ప, ఏ వ్యక్తీ ఒక ఇంటర్వ్యూలో బ్రహ్మాండమయిన విషయాన్ని బయటపెట్టదు. సభల్లోనూ, పత్రికా విలేకరుల సమావేశంలో దాన్ని చెపుతాడు. అందులోనూ క్రీడాకారులకి ఏముంటాయి అంత సెన్సేషనల్ వార్తలు? నాకు పాకిస్తాన్‌తో ఆడటం ఇష్టం లేదు అని ఏ ఆటగాడయినా చెప్పగలడా? ఇష్టమంటే సరే, ఇష్టం లేకపోయినా చెప్పడు. జట్టులో స్థానం పోతుందని భయం" అన్నాడు. అతడికి భారతదేశం పాకిస్తాన్‌తో ఆటల సంబంధం పెట్టుకోవటం అసలిష్టం లేదు.

* * *

భైరవ్, భారత్ రాష్ట్రపతి దగ్గర మెడల్ తీసుకుని క్రిందికి దిగుతూండగా, సుభాషిణి మళ్ళీ ఆవిడవైపు చూసింది. ఆమె తలవంచుకుని వుంది. అందరూ కరతాళ ధ్వనులు చేస్తూండగా, ఆమె రెండు చేతులూ వళ్ళో పెట్టుకుని వేరే వైపు చూస్తూ కూర్చుని వుంది. ఏదో దిగులు ఆమెని కలచివేస్తుందని సుభాషిణి అనుకుంది. ఆమె భర్త ఆమె పక్కన కూర్చుని వున్నాడు. అతడు మిలటరీ మనిషిలా వున్నాడు.

భర్తతో గొడవపడి ఆమె మూడ్ అలా వుందేమో అనుకుంది. ప్రభాకర్‌తో గొడవ పడినప్పుడు తను కూడా అలాగే వుంటుంది. కానీ మూడ్ బాగాలేకపోతే ఇలాంటి సభలకి, ఫంక్షన్స్‌కి రాదు. భర్త ఎంత బ్రతిమాలినా సరే!

....ఫంక్షన్ పూర్తయింది. ప్రభాకర్ స్నేహితుడికి కారు వుంది. ముంబాయిలో హోటళ్ళు చాలా ఖరీదు. స్నేహితుడి ఇంటిలోనే వుంటున్నారు.

కార్లో ముగ్గురూ బయల్దేరారు. రాత్రి పదకొండు అయింది. మెయిన్ రోడ్డు మీద వెళ్తుండగా పోలీసులు కార్లని పక్క వీధిలోంచి వెళ్ళమని సూచన్లు చేయటం కనబడింది. బాబ్రీ మసీదుని ధ్వంసం చేసిన రోజు అది.

## 2

**"ఈ రోజు** కొందరు క్రికెట్ బోర్డు కార్యాలయాన్ని ధ్వంసం చేసారు. అందుకే ఈ రోడ్ బ్లాక్ చేసినట్టున్నారు" కారు పక్కకి తిప్పి పోనిస్తూ అన్నాడు ప్రభాకర్ స్నేహితుడు.

"అవునట చాలా కాలం క్రితం మనదేశం గెలిచిన ప్రపంచకప్‌ని కూడా డామేజ్ చేసినట్టున్నారు కదూ" అంది సుభాషిణి. ఆమె మనసు వికలమయింది. ఆ తరువాత సంభాషణంతా ఆ విషయం మీదే సాగింది. ప్రభాకర్ స్నేహితుడికి కూడా క్రికెట్ అంటే చాలా అభిమానం వున్నట్టుంది. చాలా ఆవేశంగా మాట్లాడసాగాడు. పాకిస్తాన్‌తో బారతదేశం క్రికెట్ ఆడాలనీ, ఆటలకీ టెర్రరిజానికీ సంబంధం లేదని అతని వాదన. సుభాషిణికి కూడా అతని వాదన నచ్చినట్టుంది.

తన భర్త ఆ సంభాషణలో పాల్గొనకపోవటం గమనించి "మీరేమీ మాట్లాడటం లేదేమిటి?" అంది.

చీకట్లో గమనించలేదు గానీ, ప్రభాకర్ మొహం అప్పటికే జేగురు రంగుకి మారి వుంది. భరించలేనంత ఆవేశం వస్తే అతడు అలాగే మారతాడు. చేతిలో ఏమున్నా విసిరేస్తాడు. ఎదురుగా చెంప వుంటే ఎర్రగా కమిలిపోవాల్సిందే.

పక్కన స్నేహితుడున్నాడు కాబట్టి అతి కష్టం మీద తనని తాను సంబాళించుకుంటూ, "ఇందులో మాట్లాడవలసినంత చర్చనీయాంశం ఏముంది?" అన్నాడు క్లుప్తంగా.

కాదని ఆమెకి తెలుసు. భర్త మౌనంగా వున్నాడంటే, ఆ వాదనతో ఏకీభవించటం లేదన్నమాట. ఆమె తలెత్తి భర్త వైపు చూసింది. కారు అద్దాల్లోంచి వెలుతురు లోపలికి పడుతోంది. వివాహం జరిగిన మొట్ట మొదటి రోజు నుంచీ అతడి కోపం ఆమెకి అలవాటే. కానీ ప్రస్తుతం – మొదటిసారి.

భ.....య....ప.....డిం......ది!

భారత రాష్ట్రపతి వెనుక బాడీగార్డులు, అటువంటి ఫంక్షన్స్‌లో కూడా ఎందుకు కాపలా కాస్తారో ఆమెకి అర్థమైంది.

*    *    *

మరుసటి రోజు ప్రొద్దున్నే లేచి ఆమె తయారవటం చూసి "ఎక్కడికి ఇంత ప్రొద్దున్నే" అన్నాడు.

"శివాజీ గార్డెన్స్‌కి"

అతడు ఆశ్చర్యంగా "....ఎందుకు?" అని అడిగాడు.

“భైరవ్ కండూల్కర్‌ని కలుసుకోవటానికి.”

ప్రభాకర్ నవ్వు ఆపులేకపోయాడు. నవ్వుతూనే “....ఎప్పుడో ప్రాక్టీస్ చేసి ఆరేళ్ళ క్రితం అతడు ఆ ఆటస్థలంలో నేర్చుకున్న మాట నిజమే. ఇప్పుడు భారతదేశపు నెంబర్ వన్ ఆటగాడు అయ్యాక అతడు ప్రొద్దున్నే అక్కడెందుకు వుంటాడు? ఆటోగ్రాఫులవాళ్ళు వేటాడి చంపెయ్యరూ? అయినా ఇలాంటి ఆలోచన నీకెలా వచ్చింది? నీవు కాస్త తెలివైన దానివి అనుకున్నానే” ఏడిపిస్తున్నట్టు అన్నాడు.

ఆ మాటల్లో వెటకారానికి ఆమె ఒక క్షణం మాట్లాడలేకపోయింది. దాన్ని ఆసరాగా తీసుకుని అతడు కొనసాగించాడు. “....భైరవ్ లాంటి వాళ్ళు బి.బి.సి., స్టార్ స్పోర్ట్స్ లాంటి ఛానల్స్‌కే మామూలుగా ఇంటర్వ్యూ ఇవ్వరు. కొందరాటగాళ్ళయితే ఇంటర్వ్యూ కోసం డబ్బు కూడా చాలా ఎక్కువ డిమాండ్ చేస్తారు. మొన్న హైద్రాబాద్‌లో ఒక ఆటగాడిని ఏదో షోరూమ్ ప్రారంభోత్సవానికి పిలిస్తే లక్ష రూపాయలు డిమాండ్ చేశాడట. మీ ఎడిటర్ అడగటమూ సరే, నువ్వు ఆ మాట పట్టుకని అక్కడికి వెళ్ళటమూ సరే......”

అతడు మాట్లాడటం పూర్తి చేసాడని నిశ్చయం చేసుకున్నాక ఆమె నెమ్మదిగా అంది. “నేను భైరవ్‌తో మాట్లాడాను.”

పక్కలో బాంబు పడ్డట్టు అతడు అదిరిపడి “నువ్వా? అతడితోటా? ఎప్పుడు? ఎక్కడ?” అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

“నిన్న రాత్రి” అన్నదామె. “....మీరు సి.సి.బి. ప్రెసిడెంట్‌తో మాట్లాడుతుంటే.”

అతడు నమ్మలేనట్టు చూశాడు. ఆమె అన్నది “నా అంతట నేనే వెళ్ళి పరిచయం చేసుకున్నాను. అతడికి ఆంధ్రప్రదేశ్ అంటే అభిమానమట. అతడి అన్నయ్య సైన్యంలో పనిచేసేటప్పుడు హైద్రాబాద్‌లోనే ట్రెయినింగ్ పొందాడట.”

అతడి మొహంలో అప్పటికే మారుతున్న భావాల్ని ఆమె గమనించలేదు. చెప్పుకుంటూ పోయింది. “ఇప్పుడు తొమ్మిందింటికి శివాజీ పార్క్‌కి వస్తున్నాడట. అక్కడికొచ్చి ఇంటర్వ్యూ తీసుకోమన్నాడు. కార్డ్ కూడా ఇచ్చాడు.”

“అక్కడింకెవరూ లేరా? అంటే ఐమీన్.....నువ్వు మాట్లాడే టప్పుడు.”

“విలేకర్లు ఎవరూ లేరు. అతడి ఫ్రెండ్స్ , అభిమానులూ వున్నారు.”

“మీ పత్రిక సర్క్యులేషన్ అతనికి తెలుసా?” అతడి కంఠంలో కాస్త వెటకారం ధ్వనించింది. ఆమె దాన్ని గుర్తించలేదు. “అసలవేమీ అడగలేదు. ‘మీతో మాట్లాడాలి’ అనగానే, ‘రేపు పార్క్‌కి రండి’ అన్నాడు కార్డ్ ఇచ్చి దాన్ని అక్కడ గేట్ దగ్గిర చూపించమన్నాడు.”

“సాయంత్రం పార్క్‌కి రమ్మనలేదా?”

అప్పుడు గమనించిందామె అతడి మొహాన్ని. అతడలా మాట్లాడటం ఆమెకి కొత్త కాదు. ఈ విషయమై వారిద్దరికీ చాలాసార్లు పోట్లాట జరిగింది కూడా. ఆమె పని చేస్తున్నది పత్రికా విలేకరిగా. ఆ సందర్భంలో ఆమె చాలామందిని కలుసుకోవలసి వుంటుంది. ఆ విషయం అతడికి నచ్చదు. ఇద్దరూ పోట్లాడకుంటారు. అప్పుడతని మొహం ఇలాగే మారుతుంది.

గతంలో అయితే దెబ్బలాట ‘జరిగాక’ మొహం మారేది. ఈసారి అదేమీ లేకుండానే మారింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1626**

* * *

**Read other books of Yandamoori Veerendranath @**

http://kinige.com/kbrowse.php?via=author&id=355